క్లుప్తంగా

1800 మందికి అన్నదానం



భవానీపురం(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ భక్తుల ఆకలిదప్పులు తీర్చడం అభినందనీయమని పశ్చిమ, సెంట్రల్ ఎమ్మెల్యేలు వెలంపల్లి శ్రీనివాసరావు, మల్లాది విష్ణు, ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా అన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ సుప్రీమ్ ఆధ్వర్యంలో వన్‌టౌన్ రథం సెంటర్‌లోని అప్పన వెంకట కృష్ణయ్య ధర్మ సత్రం వద్ద క్లబ్‌కు సంబంధించి ఈ ఏడాది రిలీవింగ్ హంగర్ కార్యక్రమ రికగ్నైజ్డ్ డీసీ అప్పన వెంకట సత్యసాయి బాబు సహకారంతో ఆదివారం అన్నదానం చేశారు. వారు మాట్లాడుతూ ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు సుమారు 1800 మంది భక్తులకు అన్నప్రసాదాన్ని అందించిన నిర్వాహకులు అభినందనీయులన్నారు. కార్యక్రమంలో విజయవాడ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ అధ్యక్షుడు కొనకళ్ల విద్యాధరరావు, వాసవి పాస్ట్ గవర్నర్ కొనకళ్ల సత్య కృష్ణప్రసాద్, వాకర్స్ ఇంటర్నేషనల్ మాజీ అధ్యక్షులు సీహెచ్ సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

వీఎంసీ కార్యాలయాల్లో నేడు 'స్పందన' రద్దు

పటమట(విజయవాడతూర్పు): నగరవాసుల నుంచి నేరుగా సమస్యలు తెలుసుకుంటూ వారి సమస్యలను పరిష్కరించడానికి వీఎంసీ ప్రధాన కార్యాలయంలో, సర్కిల్ కార్యాలయాల్లో జరిగే సోమవారం స్పందనను దసరా ఉత్సవాల కారణంగా రద్దు చేస్తున్నట్లు వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. వీఎంసీ అధికారులు నవరాత్రి ఉత్సవాల్లో విధులు నిర్వహిస్తుండటం, ట్రాఫిక్ మళ్లింపులతో ప్రజలు కార్పొరేషన్ బిల్డింగ్ వద్దకు రావడానికి ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశాలు ఉండటంతో స్పందన రద్దు చేస్తున్నట్లు వివరించారు.

దసరా ఉత్సవాల్లో వైద్య సేవలు

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఇంద్రకీలాద్రిపై నిర్వహిస్తున్న దసరా మహోత్సవాలకు వచ్చే భక్తులు అనారోగ్యానికి గురైతే సేవలు అందించడానికి మెడ్‌స్టార్ హాస్పటల్స్ వైద్య శిబిరం ఏర్పాటు చేసింది. తొలిరోజు అస్వస్థతకు గురైన భక్తులను శిబిరానికి తీసుకొచ్చి వైద్య పరీక్షలు చేయడంతో పాటు, ఓ భక్తురాలు నీరసించడంతో సెలైన్ ఎక్కించారు. నవరాత్రులు జరిగినన్ని రోజులూ శిబిరం కొనసాగుతుందని, ఉచితంగా సేవలు అందిస్తామని నిర్వాహకులు తెలిపారు. అవసమైన వారికి మందులు ఇస్తున్నట్లు తెలిపారు. మెరుగైన సేవలు అందించాల్సి వస్తే, అంబులెన్స్ ద్వారా ఆస్పత్రికి తరలిస్తామని వారు చెప్పారు.

దుర్గామల్లేశ్వరస్వామి ఆలయానికి 50 బారికేడ్లు అందజేత



లబ్బీపేట(విజయవాడతూర్పు): ఇంద్రకీలాద్రిపై శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి వారి ఆలయ ప్రాంగణంలో ఉపయోగించుకునేలా అనంత్ డైమండ్స్ వారు 50 స్టెయిన్‌లెస్ స్టీల్ బారికేడ్స్ అందజేశారు. షోరూమ్ అధినేతలు జాస్తి వెంకట భానుప్రకాష్, విష్ణుప్రియ ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్, సభ్యులకు వాటిని అందచేశారు. భానుప్రకాష్ మాట్లాడుతూ దసరా ఉత్సవాలకు పెద్ద ఎత్తున భక్తులు తరలిరానుండటంతో వారికి ఉపయోగపడేలా స్టెయిన్‌లెస్ స్టీల్ బారికేడ్స్ అందచేసినట్లు తెలిపారు. బృందావనకాలనీ టిక్కిల్‌రోడ్డులోని షోరూమ్‌లో దసర నవరాత్రి వేడుకలు ప్రారంభించారు.

మత్తు వైద్యంపై ప్రజలకు అవగాహన అవసరం

మత్తు వైద్యుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ తారకప్రసాద్

లబ్బీపేట(విజయవాడతూర్పు): మత్తు వైద్యం (ఎనస్థీషియా)పై ప్రజలకు విస్తృత అవగాహన అవసరమని ఏపీ మత్తు వైద్యుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఉప్పులేటి తారకప్రసాద్ అన్నారు. అక్టోబరు 16 ప్రపంచ మత్తు వైద్య దినోత్సవం పురస్కరించుకుని ఎనస్థీషియాపై అవగాహన కలిగించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆదివారం ఐఎంఏ హాలులో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇండియన్ సొసైటీ ఆఫ్ ఎనస్థీషియాలజీ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఎంవీ భీమేశ్వర్ పిలుపుపై రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఉన్న వైద్య కళాశాలల్లో ప్రజలకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. అక్టోబరు 16,1846లో అమెరికాలోని హాస్పటల్‌లో తొలిసారిగా ఈదర్ ద్వారా మొదటిసారిగా రోగికి మత్తు ఇచ్చారని పేర్కొన్నారు. దీంతో ఏటా అక్టోబరు 16న 150 దేశాల్లో ఎనస్థీషియా డే జరుపుకుంటామన్నారు. ఎనస్థీషియాలో 175 సంవత్సరాల్లో ఎన్నో ఆధునిక పద్ధతులు అందుబాటులోకి వచ్చాయన్నారు. సమావేశంలో రాష్ట్ర అదనపు వైద్య విద్యా సంచాలకులు డాక్టర్ టి.సూర్యశ్రీ, మత్తు వైద్యుల సంఘం విజయవాడశాఖ అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ విశ్వేశ్వరరావు, ఏపీ పాస్ట్ ప్రెసిడెంట్ డాక్టర్ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

శ్రీమాతా శ్రీమహారాజ్ఞి..



శ్రీ దుర్గా భవానీ దేవస్థానంలో...



కేదారేశ్వరపేటలో శివకాళేశ్వరీదేవి



చిట్టినగర్‌లో మహాలక్ష్మీదేవి అలంకరణలో



మహాలక్ష్మిగా పద్మావతి



బాలాత్రిపురసుందరీదేవిగా చదునుమహాలక్ష్మి



రజితకవచాలంకృత భ్రమరాంబదేవి



కొత్తమ్మవారి గుడిలో భక్తజనం



గణాంబదేవిగా లలితాంబికా అమ్మవారు

- ఘనంగా దసరా ఉత్సవాలు ప్రారంభం
- 'పశ్చిమ' వీధులు ఆధ్యాత్మిక తరంగాలై..

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): శ్రీమాతా శ్రీమహారాజ్ఞి.. అంటూ కనకదుర్గమ్మను భక్తజనం మనసారా ప్రార్థించారు. నియోజకవర్గంలో ఆదివారం దసరా ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. 'పశ్చిమ'లోని ఆలయాలు, భక్తబృందం ఏర్పాటుచేసి పందిళ్లలో అమ్మవారు ఉత్సవాల్లో తొలిరోజు ఆదివారం బాలాత్రిపురసుందరీదేవిగా, మహాలక్ష్మిగా దర్శనమిచ్చారు. వన్‌టౌన్‌లోని కేటీ రోడ్డు, బ్రాహ్మణవీధి తదితర ప్రాంతాలు విద్యుత్ దీపాలతో, అమ్మవారి గీతాలు, వేద పఠనాలతో ఆధ్యాత్మికత వాతావరణం వెల్లివిరిసింది. వన్‌టౌన్‌లోని పలు ఆలయాల్లో దసరా ఉత్సవాలను ఘనంగా ప్రారంభించారు. కొత్త అమ్మవారి దేవస్థానం, కొత్తపేట గంగానమ్మ దేవస్థానం, బ్రాహ్మణ వీధిలోని చదునుమహాలక్ష్మమ్మ ఆలయం, వేంకటేశ్వరస్వామి దేవస్థానం, పాత శివాలయం తదితర ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి వీధులు భక్తజన సందడితో ఆధ్యాత్మిక తరంగాలుగా మారాయి.

పలు ఆలయాల్లో విశేష అలంకారాలు

కొత్తపేటలోని శ్రీగంగానమ్మను శ్రీ బాలాత్రిపుర సుందరిదేవి అలంకరించారు. చదునుమహాలక్ష్మిని రజిత శ్రీ బాలాత్రిపురసుందరీదేవి అలంకరించారు. వేంకటేశ్వరరస్వామి దేవస్థానంలో పద్మావతి అమ్మవారు మహాలక్ష్మిగా దర్శనమిచ్చారు. శ్రీభ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో (పాతశివాలయం) శ్రీ రజిత కవచాలంకృత భ్రమరాంబాదేవిగా అలంకరించారు. కృష్ణ ప్రార్థనా మందిరంలోన శ్రీ కన్యకాపరమేశ్వరిదేవిగా దర్శనమిచ్చారు. కొత్తపేటలోని దర్భేశ్వరస్వామి దేవస్థానంలో అమ్మవారు పార్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

- పూర్ణానందంపేట(విజయవాడ పశ్చిమ): కేదారేశ్వరపేటలోని శ్రీ శివకాళేశ్వరీదేవి ఆదివారం శ్రీ బాలత్రిపురసుందరీదేవిగా భక్తులకు దర్శమిచ్చారు. భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.

చిట్టినగర్ పరిధిలో..

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): శ్రీ నగరాల మహాలక్ష్మీ అమ్మవారు మహాలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆస్థాన కల్యాణ మండపంలో అమ్మవారికి నిర్వహించిన విశేష కుంకుమార్చనలో పెద్ద ఎత్తున భక్తులు, ఉభయదాతలు పాల్గొన్నారు.

కమిటీ కోశాధికారి పిళ్లా శ్రీనివాసరావు దంపతులు కలశస్థాపన చేశారు. అమ్మవారిని మేయర్ రాయన భాగ్యలక్ష్మి దర్శించుకున్నారు. దేవస్థాన కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు లింగపిల్లి అప్పారావు, మరుపిళ్ల హనుమంతరావు ఏర్పాట్లను పర్యవేక్షించగా, పాలక మండలి గౌరవ అధ్యక్షులు బెవర సూర్యనారాయణ, పొట్నూరి దుర్గాప్రసాద్, శీరం వెంకట్రావు, మజ్జి ఈశ్వరరావు, తొత్తడి భరత్ పాల్గొన్నారు.

- భీమన వారి పేటలోని శ్రీవిజయ దుర్గా రామలింగేశ్వర స్వామి వారి ఆలయంలో అమ్మవారు శ్రీబాలా త్రిపుర సుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకుడు చింతలపాటి వెంకట సుబ్రహ్మణ్యశాస్త్రి విశేష పూజలు చేశారు.
- పాలప్రాజెక్టు సమీపంలోని శ్రీలలితాంబిక పీఠంలో అమ్మవారిని గణాంబాదేవిగా అమ్మవారిని అలంకరించారు. పీఠాధీశ్వరి శివలీల మాతాశ్రీ పూజా కార్యక్రమాలు చేశారు.
- భవానీపురం కరకట్ట సమీపంలోని శ్రీదుర్గా భవానీ దేవస్థాన కమిటీ ఆధ్వర్యాన అమ్మవారి ఆలయంలో అమ్మవారిని బాలా త్రిపుర సుందరీదేవిగా అలంకరించారు. ప్రత్యేక పూజలు, హోమాలు చేశారు.
- ఆంజనేయవాగు సెంటర్‌లోని వీరాంజనేయ స్వామి ఆలయంలో శ్రీభ్రమరాంబ మల్లికార్జునస్వామి ఆలయంలో హోమాలను నిర్వహించారు. అమ్మవారిని బాలా త్రిపురసుందరీదేవిగా అలంకరించారు. ఆలయ అర్చకులు విన్నకోట శ్రీనివాసరావు శర్మ పర్యవేక్షణలో ఆలయ అర్చకులు హోమాన్ని నిర్వహించారు. ఏర్పాట్లను ఆలయ ఈవో రావూరి వెంకటేశ్వరరావు, చైర్మన్ నందిపాటి శ్రీనివాసరావు పర్యవేక్షించారు.



శతచండీయాగం

వైభవంగా అష్టోత్తర శతచండీయాగం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): లోక కల్యాణాన్ని కాంక్షిస్తూ నగరంలోని శ్రీ కన్యకా పరమేశ్వరి విస్సంశెట్టి వేంకటరత్నం హిందూహైస్కూల్స్ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన శ్రీ రుద్ర సహిత అష్టోత్తర శత చండీయాగం ఆదివారం ప్రారంభమైంది. కేబీఎస్ కళాశాల ప్రాంగణంలోని శ్రీ దాసాంజనేయస్వామి దేవస్థానం సమీపంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ప్రాంగణంలో దసరా ఉత్సవాలు పురస్కరించుకొని శ్రీ రుద్ర సహిత అష్టోత్తర శత చండీయాగం చేస్తున్నారు. దీనిలో భాగంగా 108 చండీయాగాలకు శ్రీకారం చుట్టారు. తొలిరోజు బాలాత్రిపురసుందరీదేవి అమ్మవారి అలంకారానికి సంబంధించిన మూలమంత్ర సంపుటితో చండీహోమం చేశారు. కమిటీ ప్రధాన కార్యదర్శి గోపిశెట్టి మల్లయ్య, కోశాధికారి గోళ్ల బాబావిజయకుమార్, కేబీఎస్ కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు తొమ్మండ్రు శేషయ్య, తూనికుంట్ల శ్రీనివాసు, పాట్టిశ్రీరాములు ఇంజనీరింగ్ కళాశాల కార్యదర్శి లక్ష్మణస్వామి తదితరులు వైదిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. 56 మంది చండీయాగంలో పాల్గొన్నారు.



బాలాత్రిపురసుందరీదేవిగా అమ్మవారు

మౌలిక వసతులపై వీఎంసీ ప్రత్యేక దృష్టి



స్థాయీ సంఘం సమావేశం నిర్వహిస్తున్న మేయర్ రాయన భాగ్యలక్ష్మి

పటమట(విజయవాడతూర్పు): నగరాన్ని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేసేందుకు వీఎంసీ పాలక పక్షం పలు నిర్ణయాలు తీసుకుంది. మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించింది. దీనికి రూ.5.43కోట్లు కార్పొరేషన్ జనరల్ ఫండ్స్ నుంచి నిధులు వెచ్చించడానికి ఇటీవల మేయర్ రాయన భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన స్థాయీ సంఘం తీర్మానాలు చేసింది. అందులో సర్కిల్-1 పరిధిలోని 5 పనులకు రూ. 2.5కోట్ల నిధులు, సర్కిల్-2 పరిధిలో నాలుగు పనులకు రూ. 1.71 కోట్లు, సర్కిల్-3 పరిధిలో మూడు పనులకు రూ. 1.06 కోట్లు నిధులు వెచ్చించనున్నారు.

సర్కిల్-1 పరిధిలో..

- 34వ డివిజన్లోని కుమ్మరిపాలెం సెంటర్ నుంచి గుప్తా సెంటర్ వరకు డ్రెయిన్ నిర్మాణానికి రూ. 34 లక్షలు నిధులు వెచ్చించనున్నారు
- 42వ డివిజన్‌లో రామాలయం స్ట్రీట్ నుంచి బీటీ రోడ్డు నిర్మాణానికి రూ. 22.77 లక్షలు
- నేతాజీ స్కూల్ మెయిన్ రోడ్డులో 330 మీటర్ల దూరం వరకు రూ.49.84 లక్షలు
- 45వ డివిజన్ పయ్యావుల దశరథ్ స్ట్రీట్‌లో అంబేడ్కర్ రోడ్డు నుంచి 300 మీటర్ల వరకు రూ.24.53లక్షలతో బీటీ రోడ్డు నిర్మాణం
- 43వ డివిజన్‌లో ఊర్మిళా నగర్ మెయిన్ రోడ్డు నుంచి పశ్చిమ ప్రాంతంలో ఉన్న ఆటోస్టాండ్ వరకు సీసీ అవుట్‌ఫాల్ డ్రెయిన్ నిర్మాణానికి రూ.49.74 లక్షలు వెచ్చించనున్నారు.

నగరం మరింత అభివృద్ధి

నగరాన్ని ప్రణాళికబద్ధంగా అభివృద్ధి చేయడానికి నిరంతరం కృషి చేస్తున్నాం. ప్రతి నెలా జరిగే స్థాయీ సంఘం సమావేశంలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి చేస్తున్నాం. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో, వైఎస్సార్ సీపీ వీఎంసీ పాలక పక్షం ఆధ్వర్యంలోనే నగరం మరింత అభివృద్ధి చెందుతుంది.

– రాయన భాగ్యలక్ష్మి, మేయర్

గుండె వైద్యంలో గణనీయమైన పురోగతి

కార్డియాక్ సొసైటీ ఆఫ్ ఇండియా సదస్సులో డాక్టర్ రమేష్‌బాబు

లబ్బీపేట(విజయవాడతూర్పు): గుండె వైద్యంలో గణనీయమైన పురోగతి సాధించామని కార్డియాలజిస్ట్, ఆస్టర్ రమేష్ హాస్పటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పోతినేని రమేష్‌బాబు అన్నారు. ఒకప్పుడు శస్త్ర చికిత్సలతో నయం చేసే గుండె జబ్బులను, ఇప్పుడు ఇంటర్వెన్షనల్ పద్ధతిలో నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్డియాక్ సొసైటీ ఆఫ్ ఇండియా(సీఎస్‌ఐ) ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఆదివారం గుండె జబ్బుల వైద్యంలో శస్త్ర చికిత్సలకు బదులుగా వచ్చిన ఇంటర్వెన్షన్ వైద్య విధానంలో అధునాతన వైద్య విధానాలపై నిరంతర వైద్య విద్యా కార్యక్రమం నిర్వహించారు. నగరంలో 'స్ట్రక్చరల్ కార్డియాక్ ఇంటర్వెన్షన్స్ కాంక్లేవ్-2023 'పేరుతో నిర్వహించిన ఈ సదస్సులో రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు చెందిన కార్డియాలజిస్టులు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు. చిన్న పిల్లల గుండె వైద్యనిపుణులు డాక్టర్.జ్యోతి ప్రకాష్, డాక్టర్.వాసుదేవ్, ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్టులు డాక్టర్. ఎస్.రాజా రమేష్ ,డాక్టర్.హారిత మాట్లాడారు. డాక్టర్ దగ్గుబాటి రమేష్ వర్చువల్ పాల్గొన్నారు. కార్యక్రమంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ డి.వెంకటేష్, తిరుపతి పద్మావతి చిన్న పిల్లల గుండె వైద్యశాల సంచాలకులు డాక్టర్ శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

కనకదుర్గ నగర్‌లో సాంస్కృతిక మహోత్సవాలు



కార్యక్రమాలను ప్రారంభిస్తున్న దుర్గగుడి కమిటీ సభ్యులు

విజయవాడ కల్చరల్: దసరా సాంస్కృతిక మహోత్సవాలు ఆదివారం కనకదుర్గానగర్ ప్రత్యేకంగా నిర్వహించిన వేదికపై ప్రారంభమయ్యాయి. దేవాలయ చైర్మన్ కర్నాటి రాంబాబు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం సాంస్కృతిక వికాసానికి కృషి చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో సాంస్కృతిక కార్యక్రమాల నిర్వాహకులు సైదా, గంగాధర్, రామకృష్ణ పాల్గొన్నారు.

తొలి రోజు కార్యక్రమాలు ఆంధ్రనాట్య ఆచార్యులు రాయన శ్రీనివాసరావు బృందం ఆంధ్రనాట్యంతో ప్రారంభమయ్యాయి. కుంభహారతి, మూషిక వాహన, శివశై వారం అంశాలను ప్రదర్శించారు. ఎండీ గిరి తెనాలి, బి. స్వర్ణలత హైదరాబాద్, గీతా మాధురీ నర్సీపట్నం, అపర్ణాప్రసాద్, ఉషా మాధవి, కె.వాసుదేవరావు తమ బృందాలతో కూచిపూడి, భరతనాట్యం, జానపద నృత్యాలను ప్రదర్శించారు.

ఉత్సవాల్లో నిర్విరామంగా వీఎంసీ సేవలు



స్నానఘాట్ల వద్ద శుభ్రం చేస్తున్న వీఎంసీ సిబ్బంది

పటమట(విజయవాడతూర్పు): దసరా ఉత్సవాల్లో వీఎంసీ సిబ్బంది నిర్విరామంగా సేవలు అందిస్తున్నారని కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. వీఎంసీ ఇంజినీరింగ్ డిపార్టుమెంట్ ఆధ్వర్యంలో దుర్గగుడి, స్నానఘాట్లు, గిరి ప్రదక్షిణ జరిగే 27 ప్రాంతాల్లో తాగునీటి సరఫరా చేశారు. క్యూలైన్, ఘాట్‌లో కొండపై వరకు కూడా వివిధ ప్రాంతాల్లో ఉచిత వాటర్ ప్యాకెట్ల లొకేషన్స్ ఏర్పాటు చేశామన్నారు. 12 ప్రాంతాల్లో భక్తుల సౌకర్యార్థం 120 తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేశారని తెలిపారు. పోలీసు సిబ్బంది వసతి గృహం వద్ద మరో 50 మరుగుదొడ్లను ఏర్పాటు చేశామన్నారు. ఎస్టేట్ విభాగం నుంచి రథం సెంటర్ వద్ద, కార్పొరేషన్ మెయిన్ ఆఫీస్ బిల్డింగ్ ఎదురుగా, సీతమ్మ పాదాల దగ్గర, భవానీపురంలో, రాజీవ్ గాంధీ పార్క్ ఎదురుగా భక్తుల కోసం ఉచితంగా ఆరు ఉచిత క్లాక్ రూమ్స్‌ను అందుబాటులోకి తెచ్చామన్నారు. స్నానఘాట్లు పరిశుభ్రంగా ఉండటానికి 1500 మందికి పారిశుద్ధ్య కార్మికులు నిరంతరం 24 గంటలు మూడు షిఫ్టులు వారీగా పని చేస్తున్నారన్నారు. వీఐపీలకు దుర్గమ్మ దర్శనానికి విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ తరఫున ఏడు కారులను కేటాయించామని, వివిధ విభాగాల అధికారులు పర్యవేక్షిస్తారన్నారు.



కనులారా.. మనసారా..

ఇంద్రకీలాద్రి పరిసరాలు జై దుర్గ.. జైజై దుర్గ నామస్మరణతో మార్మోగాయి. దసరా ఉత్సవాల్లో తొలిరోజు ఆదివారం బాలాత్రిపురసుందరీదేవిగా దర్శనమిచ్చిన దుర్గమ్మను భక్తజనం కనులారా దర్శించుకుని మనసారా ప్రార్థించారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలిరావడంతో క్యూలైన్లు ఆధ్యాత్మిక తరంగాలుగా మారాయి. అమ్మవారికి ప్రత్యేక కుంకుమార్చనలు చేశారు. ఘాట్లల్లో, దుర్గమ్మ అన్నప్రసాదం, ప్రసాదాల కౌంటర్ల వద్ద భక్తులు కిటకిటలాడారు. వలంటీర్లు విభిన్న ప్రతిభావంతుల సేవలో తరించారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా ఆలయ కమిటీ చైర్మన్, సభ్యులు, అధికారులు పర్యవేక్షించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ





- సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): ఉచిత కుట్టు శిక్షణ కేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని ఏపీ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ తోలేటి శ్రీకాంత్ అన్నారు. ఏపీ మహిళా సంఘం అధ్యక్షురాలు కల్లూరి శ్రీవాణి ఆధ్వర్యంలో నగరంలోని ఫుడ్ జంక్షన్ వద్ద శ్రీ కృష్ణ మహిళా ఉచిత కుట్టు మిషన్ ఏర్పాటు చేశారు. తోలేటి శ్రీకాంత్ రిబ్బన్ కట్ చేసి లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం మహిళా సాధికారతకు అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని వివరించారు. రాష్ట్ర విశ్వబ్రాహ్మణ పురోహిత పరిషత్ అధ్యక్షులు ఆరికట్ల గోవర్ధన శాస్త్రి, తెలంగాణ విశ్వబ్రాహ్మణ ధర్మ పీఠం అధ్యక్షులు నరసింహాచార్యులు పాల్గొన్నారు.